సాక్షి
చిత్తూరు

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



బాధ్యతగా ఎన్నికల విధులు

ఎన్నికల విధులను ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు బాధ్యతగా నిర్వర్తిం చాలని జేసీ ఆదేశించారు. - 8లో



జిల్లా స్టోర్ పరిశీలన

చిత్తూరులోని విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్‌ను ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. - 8లో



మహాశివరాత్రికి ముస్తాబు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం నేత్రపర్వంగా ముస్తాబవుతోంది. - 8లో

న్యూస్‌రీల్

నేడు సంకటహర చతుర్థి వ్రతం



కాణిపాక వినాయక స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలు సంకటహర చతుర్థి వ్రతం జరిపించనున్నట్లు వెల్లడించారు. వ్రతంలో పాల్గొనేందుకు భక్తులు రూ.350 చెల్లించి టికెట్ తీసుకోవాలని కోరారు. టికెట్లు ఆన్‌లైన్‌తోపాటు, ఆలయంలోనూ తీసుకోవచ్చని సూచించారు. పూజా సామగ్రిని ఆలయం తరపున అందజేయనున్నట్లు వెల్లడించారు. వ్రతంలో పాల్గొనేందుకు ఎంతమంది భక్తులకైనా అవకాశముంటుందని, టికెట్లకు పరిమితి లేదని వివరించారు. ఈ క్రమంలోనే సాయంత్రం మాడ వీధుల్లో స్వామివారిని స్వర్ణరథంపై ఊరేగించనున్నట్లు తెలిపారు. సంకటహర చతుర్థి వ్రతం పాశస్త్యంపై సామాజిక మాధ్యమాల ద్వారా సైతం విశేషంగా ప్రచారం చేయిస్తున్నట్లు వెల్లడించారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రశ్న పత్రాల పంపిణీ



ప్రశ్నపత్రాల పంపిణీని పర్యవేక్షిస్తున్న స్టేట్ అబ్జర్వర్ దుర్గాప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ పరీక్షల ప్రశ్న పత్రాలను ఆయా మండలాలకు పకడ్బందీగా పంపిణీ చేసినట్లు స్టేట్ అబ్జర్వర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 26వ తేదీన సెట్–2 ప్రశ్న పత్రాలను జిల్లావ్యాప్తంగా మొత్తం 50 పరీక్ష కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరలించి భద్రపరిచినట్లు చెప్పారు. 27న సెట్–1 ప్రశ్నపత్రాలను ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ తరలించామన్నారు. అలాగే మంగళవారం రాత్రి లోపు సెట్–3 ప్రశ్న పత్రాలను జిల్లాలోని 25 స్టోరేజ్ పాయింట్లకు 4 రూట్లలో పంపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ సయ్యద్ మౌలా, డీఐసీ మెంబర్లు దయానందరాజు, హేమలత, అబ్దుల్‌మజీద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

చిత్తూరు అర్బన్: ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలువురు మున్సిపల్ కమిషనర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) కార్యదర్శి రాంబాబును శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, ఇక్కడ పనిచేస్తున్న ఆర్.రమేష్ బాబును జంగారెడ్డిగూడెం, అద్దంకిలో పనిచేస్తున్న ఎస్.అబ్దుల్ రషీద్‌ను వెంకటగిరికి, ఇక్కడ పనిచేస్తున్న బి.వెంకటరామయ్యను పెడనకు, తిరుపతిలో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న కిరణ్‌ను మార్కాపురానికి, తిరుపతి సీనియర్ ఆడిట్ అధికారి టి.సుధాకర్ రెడ్డిని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా, కుప్పంలో పనిచేస్తున్న సి.చరణ్ తేజ్ రెడ్డిని తిరుపతి అదనపు కమిషనర్‌గా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ బి నాగేశ్వరరావును కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఉచితంగా న్యాయసేవలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

గుడిపాల: పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తాము సిద్ధంగా ఉన్నామని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. మంగళవారం గట్రాళ్లమిట్ట పంచాయతీ ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టులంటే భయపడాల్సిన పనిలేదన్నారు. చట్టాలపై అవగాహన లేకుంటేనే భూ సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. గుడిసెల్లో నివసించేవారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ విజయలక్ష్మిని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఆధార్, రేషన్‌కార్డు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి, సర్పంచ్ గుణవతి, వీఆర్‌ఓ వేలాయుధం పాల్గొన్నారు.

మెడిసిన్ @ డోర్ డెలివరీ

ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టింది.. వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టింది.. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తోంది..ఈ క్రమంలోనే దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మందులను డోర్ డెలివరీ చేసేందుకు చర్యలు చేపట్టింది.. నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆర్థికభారం తప్పిస్తోంది.. ఈ మేరకు పోస్టల్ శాఖతో పకడ్బందీ ఒప్పందం కుదుర్చుకుంది. ఖరీదైన మందులను సైతం పక్కాగా ప్యాక్ చేయించి మరీ వ్యాధిగ్రస్తులకు చేరుస్తోంది.. ఈ క్రమంలో సర్కారు చిత్తశుద్ధిపై సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.





ఇంటి వద్దనే మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఉమ్మడి జిల్లా సమాచారం

మొత్తం పీహెచ్‌సీలు	119
విలేజ్ క్లినిక్‌లు	904
నిత్యం వచ్చే ఓపీలు	సుమారు 6వేలు
దీర్ఘకాలిక సమస్యలతో వచ్చేవారు	సుమారు 3వేలు

ఎన్‌సీడీ సర్వే ద్వారా గుర్తించిన దీర్ఘకాలిక రోగుల వివరాలు

వ్యాధి	చిత్తూరు	తిరుపతి
బీపీ	12,593	16,956
మధుమేహం	9,974	15,396
బీపీ, షుగర్ రోగులు	14,092	22,748
క్యాన్సర్	245	406

- దీర్ఘకాలిక రోగులకు భరోసా
- ఇంటి వద్దకే ఖరీదైన మందులు
- పోస్టల్‌శాఖతో వినూత్న ఒప్పందం
- పేదలకు తప్పిన ఆర్థికభారం
- సరికొత్తగా శ్రీకారం చుట్టిన ప్రభుత్వం



చిత్తూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సేవలు ఇంటి ముంగిటకే వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు సొంతూరిలోనే అందుబాటులోకి వచ్చాయి. పేదలకు ఆరోగ్య భరోసా వచ్చింది. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న విధానాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం తొలుత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజస్)సర్వేను పకడ్బందీగా నిర్వహించింది. అందులో భాగంగా సుమారు 1.86 లక్షల మందికి పరీక్షలు చేయించింది. మొత్తం 92,410 మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నట్లు నిర్ధారించింది. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందిపడుతున్నవారిపై ప్రత్యేక దృష్టి సారించింది. వీరందరికీ అందిస్తున్న వైద్యసేవల వివరాలను ముందుగా మ్యాపింగ్ చేయించింది. బీపీ, షుగర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ తదితర బాధితులకు ఖరీదైన మందులను వ్యాధిగ్రస్తుల ఇంటికే పంపుతోంది. ఇందుకోసం పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రసుతం ఈ విధానంలో 245 మందికి ఇంటికే మందులు వస్తున్నాయి.

పోస్టల్‌తో ఒప్పందం ఇలా...

ఇంటికే మందుల పంపిణీకి ఆరోగ్యశాఖ అధికారులు పోస్టల్ విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఆయా మందులను సిద్ధం చేయించి, వాటిని మంచిగా ప్యాక్ చేసి విలేజ్ క్లినిక్‌లోని ఎంఎల్‌హెచ్‌పీకి అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మందులను ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా రోగుల ఇంటికే వెళ్లి అందజేస్తున్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆర్థికభారం తప్పుతోంది. వేలాది రూపాయల మందులు ఉచితంగానే అందుతున్నాయి. మెడిసిన్స్ కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో రోగుల కుటుంబీకులు సైతం వ్యయప్రయాసలు పడాల్సిన పనిలేకుండా పోయింది.



ప్యాక్ చేసిన మందులు

సద్వినియోగం చేసుకోవాలి



దీర్ఘకాలిక రోగులకు మందులను డోర్ డెలివరీ చేస్తున్నాం. ఆయా మందులను పక్కాగా ప్యాక్ చేసి, ఏమాత్రం దెబ్బతినకుండా పోస్టల్ ద్వారా ఒప్పందం ప్రకారం ఎంఎల్‌పీహెచ్‌లకు అందిస్తున్నాం. అనంతరం స్థానిక వైద్య సిబ్బంది ఆయా మందులను రోగుల ఇంటికే వెళ్లి అందించేలా చర్యలు చేపట్టాం. అలాగే వాటిని ఎలా వాడాలో కూడా వివరిస్తున్నాం. వ్యాధిగ్రస్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

ఎప్పటికప్పుడు అందిస్తున్నాం



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పకడ్బందీగా వైద్యసేవలు అందిస్తున్నాం. వారికి ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ఉచితంగా మందును ఇంటికే పంపిస్తున్నాం. ఈ సేవలు అందించే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పోస్టల్ ద్వారా మందులు చేరుస్తున్నాం. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

విలువైన మాత్రలు ఉచితంగా..



ఇది వరకు జబ్బు పడితే పట్టణానికి వెళ్లే వాళ్లం. పెద్ద వ్యాధులు వస్తే నానా అవస్థలు పడేవాళ్లం. వేలాది రూపాయల ఖర్చు అయ్యేది. ఇప్పుడు అలా లేదు. ఊళ్లోనే క్లినిక్ పెట్టారు. డాక్టర్లు ఇంటి కాడికే వచ్చి వైద్యం చేస్తున్నారు. పరీక్షలు చేసి విలువైన మందులను కూడా ఉచితంగా ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. షుగర్ మందులు ప్రభుత్వం పోస్టల్ ద్వారా ఇంటికే పంపింది. ఇది చాలా సంతోషంగా ఉంది.

– ద్రాక్షాయణి, తిరుపతి

అభినందనీయం



ఇదివరకు మాత్రలను మెడికల్ షాపులకు వెళ్లి కొనాల్సివచ్చేది. ఇప్పుడు డబ్బులిచ్చి మాత్రలు కొనే రోజులు పోయాయి. ప్రభుత్వం ఇంటికే మాత్రలు పంపిస్తోంది. అది కూడా ఖరీదైన మందులు. డాక్టర్లు కూడా ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు. మా ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి అభినందనీయం.

– కృష్ణయ్య, తిరుపతి

పేదలకు మేలు...



జగనన్న ప్రభుత్వంలో పేదలకు మేలు జరుగుతోంది. ముఖ్యంగా మాకు వైద్య ఖర్చుల భారం తప్పింది. ఊళ్లోకి డాక్టర్లు రావడం కాదు..ఇంటికాడికే వస్తున్నారు. మంచిగా పరీక్షించి..మేలైన మందులు, మాత్రలు ఇస్తున్నారు. పేదల ఆరోగ్యాన్ని ఇంతలా పట్టించుకుని అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– గిరిజ, చిత్తూరు

బోయకొండలో లక్ష కుంకుమార్చన

- నేటి నుంచి ప్రారంభం



బోయకొండ ఆలయంలో పుష్పాలంకరణ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొనే ఈ పూజలకు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఈమేరకు వారు మాట్లాడుతూ కుంకుమార్చనలో పాల్గొనేందుకు ఉభయకర్తలు ఆలయ బ్యాంకు ఖాతా 530505554 నంబర్‌లో రూ.1,500 నగదు జమ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం 9491000741, 7013534222 నంబర్లకు వివరాలు తెలియజేయాలని కోరారు. అలాగే ఆలయం వద్ద నేరుగా నగదు చెల్లించి పూజలో పాల్గొనే వెసులుబాటు ఉందని తెలిపారు. కుంకుమార్చనలో పాల్గొనే దంపతులకు ఆలయం తరపున పూజా సామగ్రి సమకూర్చనున్నట్లు వెల్లడించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాలుగు విడతలుగా పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. టికెట్‌కు నగదు చెల్లించి పూజకు రాలేని భక్తులకు పోస్టల్ ద్వారా తీర్థప్రసాదాలు పంపనున్నట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా తొలి రోజు 'టెట్'



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం తొలి రోజు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ప్రశాంతంగా జరిగింది. చిత్తూరు ఎస్వీ సెట్, పూతలపట్టు మండలంలోని వేము, పలమనేరు మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలల్లోని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి సెషన్ లో 404 మంది అభ్యర్థులకు గాను 353 మంది హాజరయ్యారు. 51 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం రెండో సెషన్‌లో 411 మంది అభ్యర్థులకు గాను 364 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలను డీఈఓ దేవరాజు, ఏడీ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

చిత్తూరుకు చేసింది శూన్యం



విలేకర్లతో మాట్లాడుతున్న ఢిల్లీబాబు

చిత్తూరు రూరల్ : బలిజ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు చిత్తూరును 20 ఏళ్లపాటు శాసించారని, అయితే చిత్తూరుకు చేసింది శూన్యమని బలిజ సంఘం నేత ఢిల్లీబాబు ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కనీసం బలిజ సామాజిక వర్గానికి కూడా ఏం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదని రోడ్లపైకి వచ్చి రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కులాలకు అతీతంగా పనిచేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. అందుకే పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చిత్తూరు ప్రజలకు విజయానంద రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించి చిరంజీవి తనను గెలిపించిన తిరుపతికి ఏం చేశారని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కులం పేరు చెప్పుకుంటూ ఎన్నికల కోసం హడావుడి చేస్తున్నారని విమర్శించారు. కులాల పేరుతో రాజకీయం వద్దని, ప్రజలకు మంచి చేసే జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

విజయవంతంగా 'సురక్ష'

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏడు ప్రాంతాల్లో విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఏడుగురు పీహెచ్‌సీ వైద్యులు, 14 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు క్యాంపుల్లో పాల్గొని మొత్తం 2,671 మందికి చికిత్సలందించారు. అందులో జనరల్‌కు 1,040 మంది, గైనిక్ సేవలకు 226, చిన్న పిల్లల సేవలకు 135, ఆర్థో 563, డెంటల్ 113, చర్మ సంబంధిత సమస్యలకు 74, కంటి సమస్యలకు 352, ఇతర సమస్యలకు 168 మంది సేవలందుకున్నారు. కంటి వెలుగు కింద 159 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

తల్లీబిడ్డలకు 'సంపూర్ణ పోషణ'

మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాల నిస్తున్నాయి. మహిళలు గర్భం దాల్చిన నుంచి నెలనెలా వైద్య పరీక్షలు చేయడం, ఆరోగ్య జాగ్రత్తలు వివరించడం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేయడం, రక్త హీనతతో బాధపడే వారికి ముందస్తుగానే వైద్యం చేస్తుండడంతో గుడిపాల మండలంలో శిశుమరణాలు లేకుండా ఉంటున్నాయి. ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తుండడంతో వైద్యవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ చర్యలు
- గర్భిణులకు నెలనెలా ఆరోగ్య పరీక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటింటికీ పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో మాతాశిశువులకు పౌష్టికాహారం పంపిణీ (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
70	228	226

గుడిపాల: మాతాశిశు మరణాల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గర్భిణులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. హెచ్‌బీ(హిమోగ్లోబిన్) సరపడా ఉంటే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ నేపథ్యంలో శిశువులు బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సి ఉంటుంది. దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెలకు సరిపడా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. రాగిపిండి, బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, గుడ్లు, బియ్యం, నూనె, పాలు సకాలంలో సరఫరా చేస్తోంది. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల చొరవతో గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుని సలహా మేరకు మందులు వాడితే గర్భంలో శిశువు ఎదుగుదల బాగుంటుంది. అవయవాల సక్రమ ఎదుగుదలతో ఆరోగ్యకరమైన శిశువులు జన్మిస్తారని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

నెల నెలా వైద్య పరీక్షలు

గర్భిణీగా రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసిన నాటి నుంచి ఆమె ఆరోగ్యంపై ఏఎన్‌ఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రసవించేలోగా నాలుగు యాంటినేటల్ చెకప్స్ చేయిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంగా భాగంగా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి గర్భిణులకు నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారు.

సేవలు భేష్



గర్భిణీగా ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించిన సేవలు భేషుగ్గా ఉన్నాయి. వైద్య సిబ్బంది సూచనల మేరకు మందులు వాడడంతో పాటు నెలనెలా అందించిన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల నాకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంది. నేను కూడా చాలా ఆరోగ్యంగా ఉన్నాను.

– శ్రీమతి, లబ్ధిదారు, నరహరిపేట

పౌష్టికాహారంతో మేలు



గర్భిణీగా ఉన్నప్పుడు ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించిన పౌష్టికాహారంతో నాకు ఎంతగానో మేలు జరిగింది. పాలు, గుడ్లు, చిక్కీ, ఖర్జూరం వంటి పోషక విలువలు ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల సుఖ ప్రసవం జరిగింది. పాప ఆరోగ్యంగా ఉంది.

– రూపిమ, బాలింత, 189కొత్తపల్లె

నేడు రైతుకు 'భరోసా'

- మూడో విడత నిధుల విడుదల

చిత్తూరు అగ్రికల్చర్: వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన కింద ఈ ఏడాది మూడో విడత నిధులను బుధవారం విడుదల చేయనున్నారు. ముఖ్యమంత్రిక వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని 2,29,848 రైతు కుటుంబాలకు రూ.45.97 కోట్ల లబ్ధి చేకూర్చనున్నారు. అలాగే సాంకేతిక కారణాలతో రెండు విడతల నగదు జమ కాని 1,349 రైతు కుటుంబాలకు రూ.34.22 లక్షలు అందించనున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకుని సకాలంలో రెన్యూవల్ చేసుకున్న 26,961 మంది రైతులకు సున్నావడ్డీ పథకంలో భాగంగా మొత్తం రూ.7.5 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష హాల్ టికెట్లను అభ్యర్థులు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్చి 3 వ తేదీన జిల్లాలో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

జిల్లా స్టోర్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌ను టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి మంగళవారం పరిశీలించారు. విద్యుత్ పరికరాల నిల్వ, సరఫరా అంశాల సంబంధిత వివరాలను డీఈ జయప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో ఇవ్వాలన్నారు. ప్రస్తుతం లో ఓల్టేజీ సమస్యలు పలు ప్రాంతాల్లో వస్తున్నాయని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని ఆదేశించారు. కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఏఈ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు

- ఈఆర్‌ఓ, నోడల్ అధికారుల సమావేశంలో జేసీ శ్రీనివాసులు


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, సమావేశానికి హాజరైన ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ :ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈఆర్‌ఓ, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఈఆర్‌ఓ, నోడల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. సంబంధిత అధికారులకు కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించాలని చెప్పారు. ఈ నెల 29వ తేదీ నుంచి నోడల్ అధికారులు తమకు కేటాయించిన పనుల్లో పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. తమ విధులకు సంబంధించిన ఫైల్స్‌ను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అదే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు నోడల్ అధికారులకు తగు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మొత్తం సిబ్బందిని మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ విభాగం గుర్తిస్తుందన్నారు. అధికారుల వివరాలను తీసుకోవడం, డేటా అప్‌లోడ్ ప్రక్రియ, సకాలంలో వారిని నియమించడం చేయాలని కోరారు. ఈవీఎంలను సరైన రీతిలో భద్రపరచాలని చెప్పారు. ఈవీఎంల రాండమైజేషన్, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజ్‌మెంట్‌కి అవసరమైన రవాణా అవసరాలకు అనుగుణంగా వాహనాలను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసేలా ఎంసీఎంసీ కమిటీ పనిచేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

మూడో దశ రీసర్వే వేగవంతం

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడవ దశ రీసర్వే పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేసి ఈకేవైసీ ప్రక్రియ చేపట్టాలన్నారు. మ్యూటేషన్ కార్యక్రమంలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకునే అవకాశం ఆర్డీఓ స్థాయికి అనుమతించినట్లు వెల్లడించారు. అసైన్‌మెంట్ భూముల కసరత్తు, రీ వెరిఫికేషన్ చేసి అర్హులకు పట్టాలు అందించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. నిర్ణయించిన గడువులోపు మూడో దశ రీసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1,500 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎక్కువ మంది ఓటర్లుంటే ఆ ప్రాంతాల్లో ఆక్సిలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం


ధ్వంసమైన పశుపరిశోధన కేంద్ర కాంపౌండ్ వాల్

పలమనేరు: పట్టణ సమీపంలో ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన పశుపరిశోధనశాల కాంపౌండ్ వాల్‌ని అక్కడికి సమీపంలోని జీడిమాకుల పల్లికి చెందిన కొందరు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఆపై ఎలాగైనా యూనివర్సిటీ భూమిని ఆక్రమించేందుకు యత్నించారు. దీనిపై స్థానిక పశుపరిశోధన సంస్థ సైంటిస్ట్ డా.వేణు మంగళవారం పలమనేరు ఆర్డీవో, డీఎస్పీలకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంపౌండ్ వాల్‌పై ఉన్న ఇనుప కంచెను తీసి ఆపై జేసీబీతో గోడను కూల్చినట్టు తెలుస్తోందన్నారు. తమ భూమి పక్కనున్న రైతులు కబ్జా చేసేందుకు యత్నించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

స్టోర్స్‌కు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: పల్లెలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద ఏర్పాటు చేయడానికి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 120 వరకు వచ్చినట్టు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 33 కేవీ కేబుల్ 1,200 మీటర్లు వచ్చినట్టు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌పై దాడి


చికిత్స పొందుతున్న శశికుమార్ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 42వ డివిజన్ కార్పొరేటర్ శశికుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ నుంచి చిత్తూరు వైపు వస్తున్న శశికుమార్‌ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారు. కింద పడిపోయిన ఓ వ్యక్తిని పైకి లేపాలని చెబుతూ మద్యం బాటిల్ తీసుకుని ఉన్న ఫలంగా శశికుమార్‌ను తలపై కొట్టారు. తీవ్ర రక్త స్రావం కావడంతో శశికుమార్ కేకలు వేశాడు. దీంతో ఆ గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. స్థానికులు శశికుమార్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. జరిగిన ఘటనపై వన్ టౌన్ సీఐ విశ్వనాథ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన యువత


పార్టీలో చేరిన వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు : పట్టణ పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన యువత వైఎస్సార్‌సీపీలో చేరింది. మంగళవారం గ్రామంలో పర్యటించిన మంత్రి సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువ నాయకుడు దేవరాజ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి ఆర్‌కే రోజా చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశబూరు. పార్టీలో చేరిన వారిలో చిదంబరం, పళని, రామ్మూర్తి, రాజేష్, భాస్కర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, రాజారెడ్డి, జానకిరామ్‌రెడ్డి, పి.బాలకృష్ణ, కె.బాలకృష్ణ, రాంబాబు, రోసిరెడ్డి, మునిరత్నంరెడ్డి, గంగమ్మ, కుప్పమ్మ, వళ్లియమ్మ, ధనలక్ష్మి, పవిత్ర తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం 'స్టూడెంట్స్ వింగ్'


మాట్లాడుతున్న ఇంటర్ పరీక్షల అబ్జర్వర్ దుర్గాప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్‌శాఖలో విద్యార్థుల కోసం స్టూడెంట్స్ సర్వీసెస్ వింగ్ ప్రారంభించినట్లు ఇంటర్ పరీక్షల స్టేట్ అబ్జర్వర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ సౌరభ్ గౌర్ పలు సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. మైగ్రేషన్, ఈక్విలెన్సీ, డూప్లికేట్ పాస్ సర్టిఫికెట్లు, ధ్రువీకరణపత్రాల్లో తల్లిదండ్రులు, విద్యార్థుల పేర్లల్లో తప్పిదాలు, పాత మార్కులు జాబితాలు పొందే సేవలను సులభతరం చేసినట్లు వెల్లడించారు. ఇకపై డూప్లికేట్ పాస్ సర్టిఫికెట్‌ను సులువుగా పొందవచ్చని చెప్పారు. ఇదివరకటిలా ఎఫ్‌ఐఆర్, అఫిడవిట్, బ్యాంక్ చలానా సమర్పించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు probieap@gmail. com, studentsservices. bieap@gmail.com మెయిల్ సిస్టమ్ తీసుకువచ్చినట్లు వివరించారు. అలాగే విద్యార్థుల మార్కుల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు.


గుర్తు తెలియని వ్యక్తి హత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


గంగాధర నెల్లూరు : మండలంలోని పెద్ద కాలవ పంచాయతీ చెర్లోపల్లికి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (40) హత్యకు గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. చిత్తూరు– తిరుత్తణి రహదారిలో చెర్లోపల్లి సమీపంలోని మామిడి తోటలో సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు మద్యం సేవించినట్లు, ఆ తర్వాత బండరాళ్లతో ఓ వ్యక్తి తలపై దారుణంగా కొట్టి హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి , సీఐ శంకర్ , ఎస్‌ఐ రామాంజనేయులు ఘటనాస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు బాంబు పేలి ఆవుకు గాయాలు



రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు వద్ద ఉప్పువంక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం నాటు బాంబు పేలి ఓ ఆవు తీవ్రంగా గాయపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన రవి అనే రైతుకు చెందని ఆవు సమీపంలోని అటవీప్రాంతంలో మేతకు వెళ్లింది. అక్కడ వన్యప్రాణుల కోసం కొందర వేటగాళ్లు అమర్చిన నాటుబాంబును పొరపాటున కొరకడంతో అది పేలిపోయింది. ఈ ఘటనలో ఆవు నోరు ఛిద్రమైంది. 15 రోజుల క్రితం ఇదే విధంగా బాంబు పేలడంతో రవికి చెందిన దూడ సైతం మృత్యువాత పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేటగాళ్ల ఆగడాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏనుగు దాడిలో రైతుకు గాయాలు


రైతును పరామర్శిస్తున్న డీఎఫ్‌ఓ వేణుగోపాల్

కుప్పం : మండలంలోని పైపాళ్యం గ్రామంలో పొలం వద్ద నిద్రిస్తున్న మునిరత్నం అనే రైతుపై సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది. స్వల్ప గాయాలతో రైతు తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. గాయపడిన మునిరత్నాన్ని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని ఏనుగును తమిళనాడు సరిహద్దు వైపునకు మళ్లించారు. గాయపడిన రైతును డీఎఫ్‌ఓ వేణుగోపాల్ పరామర్శించారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ఒంటరి ఏనుగును తమిళనాడులోని ఏనుగుల గుంపు దిశగా దారి మళ్లించినట్లు వెల్లడించారు.

3న పాఠశాలల్లో పల్స్‌పోలియో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో ఇమ్యునైజేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయానికి చేరిన ఆదేశాల ప్రకారం ప్రతి పాఠశాల పరిధిలోని 0–5 ఏళ్ల పిల్లలకు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పల్స్ పోలియోను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

మహాశివరాత్రికి శ్రీకాళహస్తి ముస్తాబు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల పనులు యుద్ధప్రతిపాదికన సాగుతున్నాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరావు సూచనలతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులను వేగవంతం చేశారు. బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా విచ్చేసే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ఏర్పాట్లు, క్యూలు, విద్యుద్దీపాలంకరణ, భక్తులు బస తీరేందుకు షెడ్లు, ధూర్జటి కళాప్రాంగణం, కైలాసం సెట్టు, శివపార్వతుల ఊంజల్‌సేవ సెట్టింగ్ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. పార్కింగ్ కోసం స్వర్ణముఖి నది గొద్దేరు ప్రాంతాన్ని శుభ్రం చేసి ఏ ర్పాట్లు చేస్తున్నారు. ధూర్జటి కళాప్రాంగణంలో వీఐపీలకు కారు పార్కింగ్, గోపురాలకు రంగులు అద్దే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయంలో రంగవల్లులు దిద్దుతున్నారు. తాగునీటిని అందించేందుకు లక్షకుపైగా వాటర్ బాటిళ్లు, మజ్జిగ, పాలు బిస్కెట్లు వంటివి సమకూర్చేందుకు టెండర్లను ఆహ్వానించారు. ఆలయం, నాలుగు మాడ వీధుల్లో ప్రత్యేకంగా అనేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలకు రంగులు అద్ది ఊరేగింపుకు సిద్ధం చేస్తున్నారు. రథాలను మరమ్మతులుచేస్తున్నారు. నూతన తెప్పలను నిర్మించారు. ట్రైల్ రన్ నిర్వహించనున్నారు.